
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శనివారం 2 మార్చి 2024



కోట్లు నేటిపాలు..!

- నాలుగేళ్లుగా ఖాద్రీశుడి కోనేరు సుందరీకరణ
- ఇప్పటికే రూ.6 కోట్లు ఖర్చు
- ఇంకా పూర్తికాని పనులు
- బ్రహ్మోత్సవాలకూ కోనేటి స్నానం లేనట్లే..



మద్దిలేరు వాగు వైపు ప్రహరీ గుంతలో నిలిచిన నీరు

కదిరి

పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి.. ఎందరో భక్తులకు ఇల వేలుపు. స్వామివారి దర్శన భాగ్యం కోసం భక్తులు ఎంతో దూరం నుంచి ఇక్కడికి వస్తూంటారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాక రాయలసీమ, కర్ణాటక నుంచి వేలాదిమంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఈ సంఖ్య లక్షలకు చేరుతుంది. మొక్కులు తీర్చే దేవుడిగా ఖాద్రీశుడికి పేరుంది. స్వామివారిని దర్శించుకునే ముందు భక్తులు కోనేటిస్నానం చేసి పవిత్రంగా ఆలయంలోకి ప్రవేశిస్తారు. ఆలయ పడమర గోపురం వెనుక కోనేరు ఉంది. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక కోనేరు సుందరీకరణ పేరుతో పనులు మొదలు పెట్టింది. నాలుగేళ్లు గడుస్తున్నా.. సుందరీకరణ పనులు పూర్తి కాలేదు. మురుగునీరు కోనేటిలో కలుస్తుందని కాంక్రీట్ పనులు చేపట్టారు. ఇందుకోసం దాదాపు రూ.6 కోట్లు ఖర్చు పెట్టారు. అయినా కోనేరు పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. మరో 17 రోజుల్లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ సంవత్సరం కూడా కోనేటి స్నానం లేనట్లేనని భక్తులు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం.. దేవుడి సొమ్ము వృథా చేసిందని ప్రతిపక్షాలు, భక్తులు ఆరోపిస్తున్నారు.

స్వామి సొమ్ముతో వైసీపీ ప్రచారం

వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆలయ కమిటీని నియమించారు. కోనేరు సుందరీకరణ పనులు చేస్తామంటూ మొదట రూ.2 కోట్లుపైగా ఖర్చు పెట్టారు. ఆ తరువాత మరో రూ.నాలుగు కోట్లు ఖర్చు పెడుతున్నారు. కోనేరు సుందరీకరణ చేస్తున్నామంటూ వైసీపీ నాయకులు ప్రచారం చేసుకున్నారే తప్ప.. పనులు చేయలేకపోయారని భక్తులు, టీడీపీ నాయకులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రూపాయి నిధులు తేకుండా ఆలయంలో భక్తులు స్వామివారికి ఇచ్చిన సొమ్ముతోనే కోనేరు పనులు చేపట్టారని భక్తులు చెబుతున్నారు. స్వలాభం కోసం చేపట్టారే తప్ప.. కోనేరు సుందరీకణ కోసం కాదని భక్తులు ఆరోపిస్తున్నారు.

ఇదీ సమస్య..

కోనేరులో అసలు సమస్య ఏమిటన్నది భక్తుల సందేహం. కోనేరు పక్కనే మద్దిలేరు వాగు ప్రవహిస్తోంది. ఆ వాగులోకి పట్టణంలోని మురుగునీరు కలుస్తోంది. ఆ మురుగునీరంతా పక్కనే ఉన్న కోనేరులోకి ఊట ద్వారా చేరుతోంది. దీంతో కోనేటి నీరు కలుషితం అవుతోంది. దీనిని అరికట్టడానికి మొదట కోనేరు అడుగు భాగాన సిమెంటుతో బెడ్డింగ్ వేశారు. చుట్టూ ప్రహరీ నిర్మాణానికి గోతులు తీశారు. ఈలోపు వర్షాలు వచ్చి మొత్తం నేలమట్టమైంది. కింద వేసిన బెడ్డింగా అలానే ఉంటుంది అని ఇంజినీర్లు భావించారు. బెడ్డింగ్ కింద ఊట నీరు పుష్కలంగా ఉన్నట్లు ఆ తర్వాత పరీక్షల్లో తేలింది. దీంతో సమస్య మళ్లీ మొదటకు వచ్చింది. జేఎన్‌టీయూ నిపుణులు, దేవదాయ శాఖ ఇంజనీర్లు వచ్చి కోనేరు చుట్టూ సిమెంట్ కాంక్రీంట్‌తో ప్రహరీ నిర్మించాలని సూచించారు. ప్రస్తుతం ఆ పనులు కొనసాగుతున్నాయి. ఈనెల 19 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నయి. బ్రహ్మోత్సవాలకు కోనేరు పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించట్లేదని భక్తులు చెబుతున్నారు. కోనేరు పనులు పూర్తి చేయడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందోనని వారు నిట్టూరుస్తున్నారు.

నాలుగేళ్లుగా పనులు

కోనేరు సుందరీకరణ పనులు నాలుగేళ్లుగా కొనసాగుతున్నాయి. 2020 నుంచి ఇప్పటి వరకు పనులు చేస్తూనే ఉన్నారు. మొదట రూ.2.17 కోట్లతో సుందరీకరణ పనులు మొదలు పెట్టారు. 2021లో వచ్చిన వర్షాలకు చేసిన పనులు కొట్టుకుపోయాయి. మళ్లీ రూ.4 కోట్ల అంచనాలతో పనులు మొదలు పెట్టారు. అవి నేటికీ పూర్తి కాలేదు. బ్రహ్మోత్సవాల నాటికి పనులు పూర్తయ్యే దాఖలాలు కనిపించట్లేదు. ముందు జాగ్రత్త చర్యలు లేకుండా, సమస్య ఎక్కడ ఉందో కూడా గుర్తించకుండా మొదట్లో పనులు చేపట్టారన్న విమర్శలున్నాయి. ఈ కారణంతోనే చేసిన పనులు వరదల్లో కొట్టుకుపోయాయని కాంట్రాక్టర్లు అంటున్నారు.



కొనసాగుతున్న కోనేరు పనులు

సమస్య పరిష్కారం అవుతుందా?

కోనేటిలోకి మురుగునీరు కలువకుండా ఇంజనీర్లు చేపట్టిన పనులతో సమస్య పరిష్కారం అవుతుందా అని భక్తులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. కోనేరు చుట్టూ పనులు చేపట్టినా మద్దిలేరు వాగు పక్కన ఇంకా మురుగునీరు ఊట ఆగలేదు. హిందూపురం రోడ్డు వైపు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మద్దిలేరు వాగులో మురుగునీరు నిలువ ఉండకుండా బయటకు వెళ్లిపోతేనే ఊట రాకుండా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలా కాకుండా పనులు చేస్తే ఏమి ప్రయోజనం లేదని వాపోతున్నారు. చివరకు కోనేరు స్వరూపం మారి ఇళ్లలో కట్టుకునే వాటర్ సంపులా మారిపోయిందని ఆవేదన చెందుతున్నారు. సుందరీకరణ పేరుతో కోనేరును నాశనం చేశారని చెబుతున్నారు. దీని కోసం భక్తులు కానుకల రూపంలో స్వామికి ఇచ్చిన సొమ్మును వృథా చేస్తున్నారని మండిపడుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు పూర్తి చేయలేం

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు ఈనెల 19న ప్రారంభంకానున్నాయి. ఉత్సవాల నాటికి కోనేరును సిద్ధం చేయలేమని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీంతో తాత్కాలిక ఏర్పాట్లు చేస్తాం.

-శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ



కాలుష్య కాటు..!

సూరప్పకుంటలో భారీగా చేపలు మృత్యువాత
దుర్వాసనతో పరిసర ప్రాంతవాసులు విలవిల
పలువురు ఆస్పత్రిపాలు

హిందూపురం అర్బన్, మార్చి 1

కాలుష్య కాటుకు చేపలు బలయ్యాయి. పట్టణ పరిధిలోని సూరప్పకుంట రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు నిండిపోయి, మరువ పారింది. దీంతో చేపలు పెద్దఎత్తున వృద్ధిచెందాయి. గత ఖరీఫ్‌లో వర్షాభావంతో సూరప్పకుంటలోకి నీరు చేరలేదు. దీనికితోడు ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో కుంట వట్టిపోయే దశకు చేరింది. ఇదే సమయంలో సమీప కాలనీల నుంచి మురుగునీరు సూరప్పకుంటలోకి చేరుతోంది. కాలుష్యం తీవ్రమైంది. దీంతో నాలుగు రోజుల క్రితం వేలాదిగా చేపలు మృత్యువాత పడ్డాయి.



ఎక్స్‌కవేటర్‌తో చెరువులో చనిపోయిన చేపలను బయటకు తీసేస్తున్న దృశ్యం

దుర్వాసనతో సతమతం



వాసన భరించలేక మహిళల తిప్పలు

సూరప్పకుంటలో చనిపోయిన చేపలను తొలగించకపోవడంతో కుళ్లిపోయి, దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఎంతగా అంటే పరిసర కాలనీల ప్రజలు భరించలేనంతగా. సమీప ప్రాంతాలైన గడ్డమీద, వాల్మీకి నగర్, అంబేడ్కర్ నగర్, రహమత్‌పురం వాసులు ఇళ్లలో ఉండలేకపోతున్నారు. ఇంటి బయట కూర్చుందామన్నా ముక్కు మూసుకోవాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. అంబేడ్కర్ నగర్‌కు చెందిన కొందరు వాసనకు వాంతులు చేసుకుని, ఆస్పత్రి పాలయ్యారు. ఎట్టకేలకు స్పందించిన మునిసిపల్ అధికారులు చెరువులో చనిపోయి పడివున్న చేపలను శుక్రవారం ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించి పక్కకు వేశారు. గుంత తీసి అందులో పూడ్చివేసే పనులు చేపట్టారు.

పోస్టేలేని చోటుకి డెప్యుటేషన్..!



హిందూపురంలోని జిల్లా ఆస్పత్రి

హిందూపురం అర్బన్, మార్చి 1: ఇదో అర్థంలేని డెప్యుటేషన్. ఆ ఉద్యోగి అవసరం ఉన్న చోటు నుంచి అలాంటి పోస్టేలేని చోటుకి పంపారు. అన్ని పరికరాలు ఉన్న చోటు నుంచి పంపించేశారు. పరికరాలు, పోస్టులేని చోటుకి డెప్యుటేషన్ వేశారు. ఉన్నతాధికారుల నిర్ణయంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. హిందూపురంలోని జిల్లా ఆస్పత్రిలో అన్ని విభాగాల వైద్యులు, సిబ్బందిని నియమించి, సేవలు అందించాలని ఆస్పత్రి అభివృద్ధి సేవల (హెచ్‌డీఎస్) కమిటీ సమావేశాల్లో స్వయానా కలెక్టరే తెలియజేస్తుంటారు. వాటిని తుంగలో తొక్కి ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని పనిలేని ఇతర ప్రాంతాలకు డెప్యుటేషన్‌పై పంపడం అనుమానాలకు తావిస్తోంది. హిందూపురం జిల్లా ఆసుపత్రిలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. విషయం జిల్లా ఉన్నాతాధికారులకు కూడా తెలుసు. అయినా ఇక్కడి నుంచి డెప్యుటేషన్‌పై పంపుతున్నారు. డెంటల్ కేర్ సెంటర్‌కు సంబంధించిన పరికరాలు హిందూపురం జిల్లా ఆస్పత్రిలో ఉన్నాయి. దంత చికిత్సలు అందించడానికి కాంట్రాక్టు ప్రాతిపదికన టెక్నీషియన్‌ను నియమించారు. ఆ టెక్నీషియన్‌ను ఆస్పత్రి సూరింటెండెంట్‌కు కూడా తెలియకుండా బుధవారం అవసరం లేని మడకశిర ప్రాంతానికి డెప్యుటేషన్ వేశారు. అసలు మడకశిరలో టెక్నీషియన్ పోస్టే లేదు. అవసరం ఉన్నచోట నుంచి అవసరంలేని చోటకు ఎందుకు వేసినట్లు అని వైద్యులు చర్చించుకుంటున్నారు. అక్కడ ఏ పని చేయకుండానే టెక్నీషియన్‌కు జీతం ఇవ్వాల్సిన అవసరం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయమై సూపరింటెండెంట్ రోహిల్‌ను అడగ్గా.. ఆయన డెప్యూటేషన్‌పై వెళ్తున్నట్లు తనకు కూడా తెలియదనీ, డీసీహెచ్ నుంచి ఆర్డర్ కాపీ తీసుకొచ్చారన్నారు. దీంతో తాను రిలీవ్ చేస్తున్నానని తెలిపారు. టెక్నీషియన్‌ను డెప్యుటేషన్‌పై పంపడంతో హిందూపురం ఆస్పత్రిలో దంత చికిత్సలు నిలిచిపోయాయి.

అవసరం మేరకు పంపా..

మడకశిర ఏరియా ఆస్పత్రిలో టెక్నీషియన్ అవసరం ఉండడంతో డెంటల్ టెక్నీషియన్‌ను డెప్యుటేషన్‌పై పంపాం. అక్కడ పని ముగియగానే వెనక్కు పంపుతాం. ఆయన స్థానంలో హిందూపురం ఆస్పత్రికి ఎవరినైనా అడ్జెస్ట్ చేస్తాం.

- పాల్ రవికుమార్, డీసీహెచ్ఎస్



నీరు తెచ్చుకుంటున్న దివ్యాంగురాలు తులసమ్మ

కన్నీటి కష్టం..!

పాపం.. తులసమ్మ..
పసితనంలోనే దురదృష్టం వెంటాడింది..
పోలియో మహమ్మారి సోకి..
కాలు పోగొట్టుకుంది.. చిన్నతనమంతా
ఇబ్బందులతోనే సాగింది.. పెళ్లయింది..
కొన్నాళ్లకే భర్త వదిలేశాడు..
అమ్మానాన్నల చెంతకు చేరింది..
కన్నోళ్లకు వయసు పైబడింది..
వారి ఆలనాపాలనా బాధ్యత
తులసమ్మపై పడింది..
నడవడానికి చేతకాకున్నా..
అష్టకష్టాలు పడుతూ..
తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటోంది..
ఇవన్నీ చాలవన్నట్లు..
ఆమెకు మరో కష్టం వచ్చిపడింది..
అదే నీటికష్టం.. కన్నీటి కష్టం..
ఊరిలోని బోరు వట్టిపోయింది..
నీటి కోసం పొలాలకెళ్లాలి..
ఎలా వెళ్లాలి..
బిందెడు భారం ఎలా మోసుకురావాలి..?
కిలోమీటరు వెళ్లి.. స్టిక్ సాయంతో..
అష్టకష్టాలు పడుతూ నీరు తెచ్చుకుంటోంది..
ఆమె కష్టం చూసి.. కన్నీళ్లు ఆగవు..

తనకల్లు మండలంలోని చిన్నచెరువుపల్లికి చెందిన తులసమ్మ కష్టాలు ఇవి. గ్రామంలోని పంచాయతీ బోరు నెలరోజుల క్రితం ఎండిపోయింది. దీంతో ఊరిలో నీటికి తిప్పలు వచ్చాయి. నీటి కోసం ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. గ్రామ సమీపంలో వ్యవసాయ బోర్లు కూడా లేవు. కిలోమీటరు అవతల వ్యవసాయ బోరు ఉంది. గ్రామానికి చెందిన 120 కుటుంబాల వారు నీటి కోసం అక్కడికెళ్తే.. తోట యజమానులు అడ్డుకుంటున్నారు. పంటకు నీరెలా పెట్టుకోవాలని వాపోతున్నారు. దీంతో చేసేదిలేక ఊరి జనం రెండు కిలోమీటర్ల దూరంలోని ఈతోడు గ్రామానికెళ్లి ఈను తెచ్చుకుంటున్నారు. దివ్యాంగురాలైన తులసమ్మ.. పొలం వారిని బతిమాలి కిలోమీటరు దూరంలోని వ్యవసాయ బోరు నుంచి నీరు తెచ్చుకుంటోంది. ఒక్క బిందెకే ఆమె నానా తిప్పలు పడాల్సి వస్తోంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవట్లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

- తనకల్లు

అన్నదాత ఆగ్రహం

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి
లో ఓల్టేజీతో పంటలు ఎండుతున్నాయని మండిపాటు



సబ్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న రైతులు

గాండ్లపెంట, మార్చి 1: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై అన్నదాతలు మండిపడ్డారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ముట్టడించారు. మండలంలోని ద్వారనాల, కటారుపల్లి, కటారుపల్లి క్రాస్, నల్లసానివారిపల్లి, గజ్జలవారిపల్లికి చెందిన రైతులు సబ్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. నాలుగు గంటలపాటు బైఠాయించారు. రైతులు మాట్లాడుతూ.. కటారుపల్లి పంచాయతీలో లోఓల్టేజీ కారణంగా పంటలు ఎండుముఖం పట్టాయని ఆవేదన చెందారు. ఫీజులు, జంపర్లు, మోటార్లు పదేపదే మరమ్మత్తులకు వస్తున్నాయన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. కమతంపల్లి, అబ్బావాండ్లపల్లి, బురుగుపల్లి తదితర గ్రామాల పరిధిలోని వ్యవసాయ మోటార్లకు కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి నుంచి విద్యుత్ సరఫరా చేస్తుండేవారు. కుమ్మరవాండ్లపల్లి వద్ద గల పరిశ్రమలకు లోఓల్టేజీ సమస్య తలెత్తుతోందంటూ కమతంపల్లి వద్ద విద్యుత్ వైర్లను అధికారులు కట్ చేసి, గాండ్లపెంట సబ్‌స్టేషన్ నుంచి కమతంపల్లి, బూరగపల్లికి కరెంటు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న రైతులు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో ఇలాంటి నిర్ణయాలు ఏంటంటూ మండిపడ్డారు. విద్యుత్ సమస్య తలెత్తితే పంటలు పూర్తిగా ఎండిపోతాయనీ, పెట్టుబడులు కూడా దక్కక తీవ్రంగా నష్టపోతామని ఆవేదన చెందారు. కమతంపల్లికి కుమ్మరవాండ్లపల్లి నుంచి విద్యుత్ సరఫరా ఇవ్వాలనీ, గాండ్లపెంట నుంచి వద్దని డిమాండ్ చేశారు. ఏడీ సుబ్రహ్మణ్యం సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని, రైతులతో చర్చించారు. కమతంపల్లి, బూరుగుపల్లికి కుమ్మవాండ్లపల్లి నుంచి విద్యుత్ సరఫరా చేస్తామని, కటారుపల్లికి గాండ్లపెంటనుంచి ఇస్తామని హామీ ఇవ్వడంతో అన్నదాతలు శాంతించారు.

కదిరి ఏఈ అత్యుత్సాహం

గాండ్లపెంటలో గతంలో ఏఈగా పనిచేసి, కదిరికి బదిలీ అయిన గౌరీశంకర్ అత్యుత్సాహం ప్రదర్శించారు. గాండ్లపెంట ఏఈ విశ్వనాథ్‌ను సంప్రదించకుండానే కుమ్మరవాండ్లపల్లి వద్ద ఉన్న పరిశ్రమలకు లో ఓల్టేజీ సమస్య తలెత్తుతోందంటూ గాండ్లపెంట సబ్‌స్టేషన్ నుంచి కమతంపల్లి, బూరుగుపల్లికి విద్యుత్ సరఫరా చేసే పనులు చేపట్టారు. దీనిని రైతులు అడ్డుకుని, పనులు నిలిపి వేయించారు. గాండ్లపెంట పరిధిలోకి వచ్చి కదిరి ఏఈ పనులు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

నేడు, రేపు క్యాన్సర్ వైద్యశిబిరం



ఎమ్మెల్యే ఇంటి ఆవరణలో క్యాన్సర్ పరీక్షల బస్సు

హిందూపురం, మార్చి 1: పట్టణంలోని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్ద శని, ఆదివారాల్లో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన వాహనం ద్వారా పరీక్షలు చేస్తారన్నారు.

ఉరుకులు.. పరుగులు..

ఇంటర్ పరీక్షలు ప్రారంభం...
తొలిరోజు 363 మంది గైర్హాజరు



రొళ్లలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొత్తచెరువు, మార్చి 1: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నిమిషం ఆలస్యమైనా పరీక్షాకేంద్రంలోని అనుమతించరన్న నిబంధన నేపథ్యంలో పలుచోట్ల విద్యార్థులు ఉరుకులు.. పరుగులతో చేరుకోవడం కనిపించింది. ఎట్టకేలకు పరీక్ష ప్రశాంతంగా సాగింది. జిల్లాలోని 41 పరీక్షా కేంద్రాల్లో 11,802 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. 363 మంది గైర్హాజరవడంతో 11,439 మంది పరీక్షలు రాశారని ఆర్ఐఓ సురేశ్ తెలిపారు. ముదిగుబ్బలో విద్యార్థులు హాల్‌టిక్కెట్ నంబర్లను సరిచూసుకుంటూ హడావుడి చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల వద్దకు వచ్చి, వారికి ధైర్యం చెప్పడం కనిపించింది. కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసి వేయించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.





ముదిగుబ్బలో పరీక్షా కేంద్రానికి పరుగున వస్తున్న విద్యార్థి, నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

గురుకుల ప్రవేశానికి దరఖాస్తులు

కొత్తచెరువు, మార్చి 1: గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతులు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మీనాక్షి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఈఓ విడుదల చేశారు. ఈనెల 30 వరకు https.//aprs.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ-1 నాగరాజు, సూపరింటెండెంట్ పురుషోత్తం ప్రసాద్, కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజాసంక్షేమం

● భవిష్యత్తుకు గ్యారెంటీలో పరిటాల జ్ఞాన

ధర్మవరం, మార్చి 1: ప్రజా సమక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని, ఆయన సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సతీమణి పరిటాల జ్ఞాన పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తపేటలో గల 38వ వార్డులో శుక్రవారం ఆమె బాబుష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని తెలుగుమహిళలతో కలిసి నిర్వహించారు. వార్డులో పరిటాల జ్ఞానకు ప్రజల నుంచి ఘనస్వాగతం లభించింది. ఆమె ఇంటింటా తిరిగి ప్రజలకు మినీమేనిఫెస్టోలోని పథకాల గురించి వివరించారు. కుటుంబంలో ఎవరెవరికి ఏయే పథకాలు వర్తిస్తాయి.. ఏ మేరకు లబ్ధి చూకూరుతుందో వివరించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం కొందరికే పథకాలు అందిస్తూ.. మిగిలిన వారికి మొండి చేయి చూపుతోందన్నారు. జగన్ ప్రభుత్వం ఎంతోమంది అర్హులకు పథకాలను అందించడం లేదని దుయ్యబట్టారు. కనుక వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు ముతుకూరుబీబీ, మాదన మహేశ్వరి, భీమనేని గీతావాణి, స్వర్ణకుమారి, మున్నీ, బాను, నాగరత్న, శారద, సునంద, మీనాక్షమ్మ, మాలతి, వసంత, ఇందిర, రమాదేవి, ప్యారీమా, వహీదా, కత్తుల సునీత, నాగూర్‌బీ, షెమీమ్, అశ్వర్థమ్మ, ఆదెమ్మ పాల్గొన్నారు.

17వ వార్డులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతంకాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ బీరేగోపాలక్రిష్ణ పార్టీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వార్డులో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, రాళ్లపల్లిషరీఫ్, జిలకరశీన, మాదనసుబ్బయ్య, కరెంటు ఆది, గోసలశ్రీరాములు, పోసనిశ్రీనివాసులు, చట్టా లక్ష్మీనారాయణ, మాధవరెడ్డి, మారుతీస్వామి, బద్రి నారాయణస్వామి, కేతినేని రాజ, చెలిమిశివరాం, తొగట అనిల్, వీరయ్య, వాసుదేవ, మాబు, బీరే శీనా, ఉస్మాన్, బాబావలి, వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగరాజుపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ

పుట్టపర్తి రూరల్: మండలంలోని జగరాజుపల్లిలో టీడీపీ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాల్సిన చారిత్రక అవసరాన్ని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలు, రామాంజనేయులు, వెంకటేసు, గంగయ్య, నరసింహమూర్తి, నారాయణ, ఎల్లప్ప, చెన్నప్ప, యువనాయకులు నాగరాజు, నారాయణస్వామి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మైలసముద్రంలో ..

కొత్తచెరువు: మండలంలోని మైలసముద్రం గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీచేశారు. వచ్చే ఎన్నికలలో టీడీపీని ఆదరించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నాయకులు కిలారి శ్రీనాథ్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాగారెడ్డిపల్లి, మలకవేముల గ్రామాల్లో..

ముదిగుబ్బ: మండలంలోని నాగారెడ్డిపల్లి, మలకవేముల గ్రామాలలో టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ సూపర్ సిక్స్ పథకాలైన మహాశక్తి, యువగళం, అన్నదాత, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అమ్మకు వందనం, బీసీ రక్షణ చట్టం తదితర పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, నాయకులు సూర్యశేఖరరాజు, కనుమచంద్ర, కోట్ల బాబీ, మహబూబ్‌పీరా, ఐటీడీపీ రాజు, రంగనాయకులు, నవీన్‌యాదవ్, దేవేంద్ర, విశ్వనాథ్, చికెన్‌తిరుపాల్, కృష్ణమూర్తి, నారాయణస్వామి, కిష్టప్ప, శేఖర్, వెంకటాద్రి, వెంకటరాముడు, శంకర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలోని 38వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న పరిటాల జ్ఞాన


17వ వార్డులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు


పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో..


కొత్తచెరువు మండలం మైలసముద్రంలో ..


ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లిలో ..

టీడీపీని గెలిపించాలంటూ ప్రచారం


4వ వార్డులో ప్రచారం చేస్తున్న కందికుట యశోదమ్మ

కదిరి, మార్చి 1: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ ప్రజలను కోరారు. పట్టణంలోని 4వవార్డులో శుక్రవారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీడీపీ విడుదల చేసిన మినీ మేనిఫెస్టో ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూర్చుతుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కనుక వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పర్వీన్‌బాను, మోపూరిశెట్టి చంద్రశేఖర్, డైమండ్ ఇర్ఫాన్, కొమ్మినేని గంగయ్యనాయుడు, విశ్వనాథ్, నాగప్ప, అహమ్మద్, ఐ టీడీపీ నాయకులు మన్సూర్, జునైద్, పవన్, అలి, గంగరత్నమ్మ, సుశీల, ప్రేమలత, ఫరీదా, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సంసిద్ధం : కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తి, మార్చి 1: జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సంసిద్ధం చేశామని కలెక్టర్ అరుణ్‌బాబు వివరించారు. అమరావతి నుంచి శుక్రవారం ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష జరిపారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితో చేర్పులు, మార్పులు, తొలగింపులపై వివరించారు. అలాగే నియోజకవర్గాలవారీగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులను తెలియజేశారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో కొండయ్య, నియోజకవర్గాల ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, గౌరీశంకర్, వంశీకృష్ణ, వెంకట శివసాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు విరివిగా రుణాలివ్వాలి

పుట్టపర్తి, మార్చి 1: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా పరిశ్రమలు, ప్రోత్సాహక మిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సర్వే, సపోర్ట్ మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. పరిశ్రమలు, యూనిట్ల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న పారిశ్రామికవేత్తలకు సంబంధించి బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలోని పరిశ్రమలను తనిఖీచేసి, పనితీరుపై నివేదిక సమర్పించాలన్నారు. ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించడం, పనితీరును మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే పథకాన్ని ప్రకటించిందని కలెక్టర్ పేర్కొన్నారు. దీని ప్రయోజనాలను ప్రజలకు చేర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మేనేజర్ చాంద్ బాషా, అగ్నిమాపక అధికారి శంకర్ రెడ్డి, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, కాలుష్య నియంత్రణాధికారి కిషోర్ పాల్గొన్నారు.

దర్జాగా ప్రభుత్వ స్థలం కబ్జా

● పట్టించుకోని అధికారులు


ప్రభుత్వ స్థలంలో పునాదికి గుంత తవ్వుతున్న దృశ్యం

నల్లచెరువు, మార్చి 1: మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల సెంటు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నా, అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. బస్టాండ్‌కు దగ్గరలో ఉన్న ఈస్థలాన్ని గతంలో కొంత మంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే, గ్రామస్థులందరూ ఏకమై కబ్జాదారులను అడ్డగించి పోలీస్ స్టేషన్‌వరకు వెళ్లారు. దీంతో అప్పుడు కబ్జాను ఆపివేశారు. అయితే ఇప్పుడు మళ్లీ ఆస్థలానికి ఆనుకుని ఉన్న ఓ ఇంటి యజమాని అదును చూసి, ఆ స్థలంలో పునాది వేయడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఆ స్థలంలో ప్రజలసౌకర్యార్థం బస్ షెల్టర్‌కానీ, మరుగుదొడ్లు కానీ నిర్మించాలని గతంలో నాయకులు తీర్మాణించారు. కాగా దానిని మళ్లీ కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంలో అంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విలువైన స్థలం కబ్జాకు గురికాకుండా ప్రజలకు అవసరాల నిమిత్తం వినియోగించాలని వారు కోరుతున్నారు.

ఓటుహక్కుపై అవగాహన



ఓటు హక్కుపై పోస్టర్లు విడుదల చేస్తున్న సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగ ప్రసాద్

పుట్టపర్తి, మార్చి 1: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో కీలకమైనదని దానిని అర్హత గల ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ అధికారి, చీఫ్ నోడల్ అధికారి శివరంగ ప్రసాద్ సూచించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఆయన ఓటు హక్కుపై పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అత్యంత శక్తివంతమైనదన్నారు. దేశాభివృద్ధిలో కీలకమైనది ఓటేనన్నారు. అర్హులు ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడానికి మంచి నాయకుడిని ఓటు ద్వారా ఎన్నుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఓటును ఎలా వినియోగించాలో ఈవీఎం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ధర్మవరం, మార్చి1: రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వడిగ్రీ కళాశాల విద్యార్థి శ్రీనివాసులు ఎంపికైనట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గత ఫిబ్రవరి 29వ తేదీన బత్తలపల్లి ఆర్డీటీ క్రీడామైదానంలో నిర్వహించిన ఉమ్మడి అనంతపురం జిల్లా ఎంపిక పోటీలలో తమ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీనివాసులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థి నెల్లూరు జిల్లా కొవ్వూరులో ఈనెల 8 నుంచి 10వతేదీ వరకు జరిగే 71 వ అంతరాష్ట్ర సీనియర్ కబడ్డీ పోటీలో పాల్గొనున్నారన్నారు. కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్‌తో పాటు, పీడీ ఆనంద్, అధ్యాపకులు ఆ విద్యార్థిని అభినందించారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు


కదిరిలో ఓ పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టిక్కెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

కదిరిఅర్బన్, మార్చి 1: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం సజావుగా సాగాయి. పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలు, బ్లూమూన్ జూనియర్ కళాశాల, స్పేస్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 361మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 348మంది రాశారు. బాలికల కళాశాలలో 318మందికిగాను 311మంది, బ్లూమూన్‌లో 439కిగాను 425మంది, స్పేస్‌లో 393కుగాను 376మంది హాజరైనట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 134 మంది విద్యార్థులకు గాను 125 మంది పరీక్షలకు హాజరయ్యారని, 9 మంది గైర్హాజరయ్యారని, ఎగ్జామినేషన్ అధికారులు హమీద్, వరప్రసాద్ తెలిపారు.

దళిత ద్రోహి సీఎం జగన్

ధర్మవరం, మార్చి 1: సీఎం జగన్ దళిత ద్రోహి అని టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్‌రెడ్డి దళితగిరిజనుల సంక్షేమ పథకాలను రద్దు చేశారని మండిపడ్డారు అయితే దీనిపై వైసీపీలో ఉండే దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో దళితగిరి జనులను దాదాపు 2747 మందిని చంపించారని ఆరోపించారు. ప్రధానంగా ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లింపు, ఎస్సీఎస్టీ కార్పొరేషన్లబ్యాంకు రుణాలు రద్దు, భూమికొనుగోలు పథకం రద్దు, విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు తొలగింపు, కులాంతర వివాహాల ప్రోత్సాహం రద్దు లాంటివి చేపట్టి దళితులకు అన్యాయం చేశారని తెలిపారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీలు గమనించి వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలని ఆయన కోరారు.

గుండెపోటుతో వ్యవసాయ కూలీ మృతి

నంబులపూలకుంట, మార్చి 1: మండలకేంద్రానికి సమీపంలోని ఎన్ రెడ్డివారిపల్లికి చెందిన వ్యవసాయ కూలీ రంజాన్‌వలి (38) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన శుక్రవారం ఉదయం వ్యవసాయ పొలంలోకి కూలి పనికి వెళ్లారు. పని ముగించుకుని ఇంటికి వస్తుండగా.. గ్రామానికి సమీపంలోని కొత్త కుంటవద్ద ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గమనించిన గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే నంబులపూలకుంట ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలించారు. వైద్యులు పరీక్షించి గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థికసాయం

ఓబుళదేవరచెరువు, మార్చి 1: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు వెంకటేష్‌కు శుక్రవారం ఆ కార్మిక సంఘం నాయకులు ఆర్థికసాయం అందించారు. బీసీకాలనీలో నివాసముంటున్న వెంకటేష్‌ను వారు పరామర్శించి.. రూ.7.500 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు, భవన కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కేశవ, రవికుమార్, నాయకులు శ్రీనివాసులు, సూర్యనారాయణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కదిరి, మార్చి 1: మున్సిపాలిటీ పరిధిలోని బోయరామన్న పల్లి పరిసర ప్రాంతంలో శుక్రవారం జూదమాడుతున్న పదిమందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బలరాం తెలిపారు. సీఐ పుల్లయ్య ఆదేశాల మేరకు బోరామన్నపల్లి వద్ద జూదమాడుతున్న వారిపై దాడిచేసి పదిమందిని పట్టుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి నుంచి 7 ద్విచక్రవాహనాలు, 7 సెల్‌ఫోన్లు, రూ.40వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

పుట్టపర్తి రూరల్, మార్చి 1: పదవీ విరమణ పొందిన హిందూపురం టూటౌన్ ఆర్పీ ఎస్ఐ భాస్కర్‌ప్రసాద్, కనగానిపల్లి పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తికి జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో శుక్రవారం వీడ్కోలు సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆ ఇద్దరినీ ఎస్పీ మాధవరెడ్డి పూలమాలు, శాలువాలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగులకు పదవీ విరమణ సాధారణమన్నారు. వారు ప్రజలకు అందించిన సేవలే శాశ్వతమని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, ఏఓ సుజాత, ఆర్ఐ రవికుమార్ డీపీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో మహిళలకు రక్షణ కరువు: బీజేపీ

పుట్టపర్తి, మార్చి 1: పశ్చిమబెంగాల్‌లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిరంకుశ వైఖరే ఇందుకు కారణమని బీజేపీ మాజీ ఎమ్మెల్యే పార్థసారథి మండిపడ్డారు. బీజేపీ శ్రేణులు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌కాళీలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. మమతాబెనర్జీ ముఖ్యమంత్రి పదవికి అనర్హురాలన్నారు. మహిళలపై జరుగుతున్న మతోన్మాద దాడులను అరికట్టడంలో సాటిమహిళగా ముఖ్యమంత్రి విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, వెంకటేశ్, సుమతి తులసాని, కొండమరాజు, కత్తి రాజారెడ్డి, హరిక్రిష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ సూచన


పెనుకొండలో ఎన్నికల సిబ్బందికి వసతిని పరిశీలిస్తున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మార్చి 1: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. జిల్లాలోని పలుప్రాంతాలలో పోలింగ్‌కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ముఖ్యంగా సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలైన నీకేపల్లి, కుంటిమద్ది, రామగిరి, నాగసముద్రం, పోలేపల్లి, ననసకోట, భానుకోట, కనగానిపల్లి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేపట్టాల్సిన భద్రతా చర్యలు గురించి పోలీసు, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. గత ఎన్నికలలో నేరాలకు పాల్పడ్డ వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసుఅధికారులకు తెలిపారు. ఎస్పీ వెంట ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్ఐలు ఉన్నారు.

సిబ్బందికి వసతి పరిశీలన

సార్వత్రిక ఎన్నికలలో నేపథ్యంలో విధులు నిర్వహించే సెంట్రల్‌ఫోర్సు విభాగాలకు, ఇతర పోలింగ్ సిబ్బందికి వసతి ఏర్పాటు చేసే ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. పెనుకొండ డీఎస్పీ బాబ్‌జాన్‌తో కలిసి పెనుకొండ పోలీసు స్టేషన్‌పరిధిలో ఇండోర్‌స్టేడియం సమీపంలోని ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి

ధర్మవరం, మార్చి1: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో శుక్రవారం చౌడేశ్వరిదేవి ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. రాజేంద్రనగర్‌కాలనీతో పాటు మారుతీనగర్, బాలాజీనగర్ కాలనీల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీఅధ్యక్షుడు అన్నంవెంకటేశులు, ఉపాధ్యక్షుడు సోమశేఖర్, కోశాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

లారీ దగ్ధం

● ఇంజిన్‌లో షార్ట్‌సర్క్యూట్ వల్ల చెలరేగిన మంటలు


దగ్ధమవుతున్న లారీ

ధర్మవరం రూరల్, మార్చి1: మండలంలోని చిగిచెర్ల సమీపంలో ఇంజన్‌లో విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చేలరేగి లారీ దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ నారాయణస్వామి తెలిపిన వివరాల మేరకు.. లారీ ధర్మవరం నుంచి జంగాలపల్లి వైపు వెళుతుండగా చిగిచెర్ల సమీపంలో ఉన్నట్టుండి ఇంజన్‌లో పొగలు వచ్చాయన్నారు. దీంతో వెంటనే లారీని పక్కకు ఆపి బయటకు దూకేశానన్నారు. ఆ తర్వాత పెద్దఎత్తున మంటలు చెలరేగాయని, లారీ ముందుభాగం మొత్తం దగ్ధమైందని తెలిపారు. ఇంజన్‌లో విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వగానే వారు వచ్చి మంటలను ఆర్పివేశారన్నారు. కాగా లారీలో ఎలాంటి లోడు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని తెలిపారు.

నేడు టీడీపీ సమావేశం

పుట్టపర్తి, మార్చి 1: టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులు తప్పక హాజరు కావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ముదిగుబ్బ, మార్చి1: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల, ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను ధర్మవరం ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో నీడ, తాగునీరు ఏర్పాటు చేయాలని, ఓటర్లకు ఇబ్బంది లేకుండా చూడాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆస్తి, ఖాళీ స్థలం పన్నుపై వడ్డీమాఫీ

ధర్మవరం, మార్చి 1: ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలం పన్నుపై వడ్డీమాఫీ చేయడం జరుగుతుందని కమిషనర్ రాంకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 31వ తేదీలోగా ఏకమొత్తంగా పన్ను చెల్లిస్తే ఈ వడ్డీమాఫీ అవుతుందన్నారు. కావున మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్, ఆన్‌లైన్, నెట్ బ్యాంకింగ్, డెబిట్‌కార్డుల ద్వారా పన్నులు చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తికి పాముకాటు

ధర్మవరంరూరల్, మార్చి1: మండలంలోని పోతుకుంట బీసీకాలనీకి చెందిన శివరాం శుక్రవారం ధర్మవరం చెరువులో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు పాముకాటుకు గురయ్యాడు. స్థానికులు వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

కదిరిఅర్బన్, మార్చి 1: పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం అరుణ్‌కుమార్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి విద్యార్థుకు క్రీడాపోటీలు నిర్వహించారు. రెండురోజులపాటు జరిగే క్రీడల్లో వాలీబాల్, కబడ్డీ పోటీలుంటాయన్నారు.

నిరుపయోగంగా సీసీ కెమెరాలు

● ఏడాదిగా పని చేయని వైనం

● కొరవడిన నిఘా

గాండ్లపెంట, మార్చి 1: మండలకేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కెమెరాలు ఏడాదిగా పని చేయలేదని స్థానికులు చెబుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా ఉంచడానికి ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే ఇవి పనిచేయకపోవడంతో నిఘా లేక కూడలిలో ఏమి జరిగినా తెలిసే అవకాశం లేకుండా పోతోంది. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో మద్యం, డబ్బు విచ్చలవిడిగా సరఫరా అయ్యే అవకాశముందని ప్రజలు వాపోతున్నారు. కొత్త వ్యక్తులు, కొత్త వాహనాలు వచ్చినా వాటిపై అధికారులు ఎలా దృష్టి సారిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి సీసీ కెమెరాలను మరమ్మతు చేయించాలని వారు కోరుతున్నారు. దీనిపై ఎస్ఐ క్రిష్ణవేణిని ఆంధ్రజ్యోతి వివరణ అడగగా నాలుగు రోడ్ల కూడలిలో సీసీ కెమెరాలు పనిచేయని మాట వాస్తవమేనని, త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.


నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు (వృత్తాల్లో...)



ఇలా చేస్తే తీసేస్తాం..!

- యోగా టీచర్లకు ప్ర'బుద్ధుల' బెదిరింపులు
- ఆంధ్రజ్యోతి కథనంతో బీవైహెచ్‌ఎఫ్ ఉలికిపాటు
- వాట్సాప్ గ్రూపుల నుంచి వందల మంది తొలగింపు
- గుంటూరుకు వస్తే సెటిల్ చేస్తామని బుజ్జగింపు



'సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నిస్తున్నాం' అంటూ చూపుతున్న లేఖలు



అనంతపురం విద్య, మార్చి1: బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ ఆగడాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఏజెంట్లు, బ్రోకర్ల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులకు వల వేసి లక్షలు గుంజిన వ్యవహారాన్ని ఆంధ్రజ్యోతి బట్టబయలు చేసింది. 'అక్రమాల యోగాసనం' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. దీంతో ఆ సంస్థ నిర్వాహకుల్లో కీలకంగా వ్యవహరించే ఓ వ్యక్తి కొందరు యోగా టీచర్లకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగారు. బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ (బీవైహెచ్ఎఫ్) బ్యాచ్‌ల పేరుతో ఉన్న గ్రూపుల నుంచి ఆ సంస్థ నిర్వాహులు సుమారు వంద మందిని తొలగించినట్లు తెలిసింది. 'న్యూసెన్స్ క్రియేట్ చేయవద్దని ఆరు నెలల నుంచి చెబుతున్నాను. అయినా చేస్తున్నారు' అని ఓ టీచర్‌కు ఫోన్ చేసి మండిపడ్డారట. 'మీరు ఎంప్లాయిమెంట్ అగ్రిమెంట్ ఫాంను క్లియర్‌గా చదువుకుని సంతకాలు చేశారు. ఇలా చేస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం' అని హెచ్చరించారని బాధితులు వాపోయారు. 'మీడియాకు సమాచారం ఇస్తే మీకే ఇబ్బంది' అని హెచ్చరించినట్లు తెలిసింది. యోగా టీచర్స్ ఫౌండేషన్ పేరిట గ్రూపులు పెట్టుకుని చర్చలు చేసినా, న్యూసెన్స్ క్రియేట్ చేసినా ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, జీతాలు కూడా ఇవ్వబోమని బెదిరించారు. 'మార్చి 10వ తేదీన గుంటూరు వంద మంది కాకుంటే.. వెయ్యి మంది రండి. కూర్చుని సెటిల్ చేస్తా' అని కొందరిని బుజ్జగించే ప్రయత్నాలు కూడా ఆ వ్యక్తి చేశారని సమాచారం.

భారీగానే బాధితులు

బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ నిర్వాహకుల వలలో చిక్కుకున్నవారు రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది ఉన్నారని తెలిసింది. విశాఖపట్టణానికి చెందిన ఓ బాధితుడు రూ.2.50 లక్షల వరకూ నిర్వాహకులకు చెల్లించానని వాపోయాడు. అతను విధుల్లో చేరి పది నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా జీతం చెల్లించలేదని సమాచారం. కొందరు బ్రోకర్లు, ఏజెంట్ల ద్వారా రూ.2 లక్షలు, రూ.3 లక్షలు వసూలు చేసి మోసగించారు. కదిరి ప్రాంతంలో వ్యవసాయశాఖలో పనిచేసే ఓ ఉద్యోగి ఇదే తరహాలో తన కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇప్పించినట్లు సమాచారం. ఆయన అంతటితో ఆగకుండా, కమీషన్లు వస్తాయని ఏజెంట్ అవతారం ఎత్తి మరి కొందరికి కూడా ఉద్యోగాలు ఇప్పించారు. ఆంధ్రజ్యోతి కథనంతో ఈ కుంభకోణం బయటపడటంతో బాధిత టీచర్లు ఆయనకు ఫోన్ చేస్తున్నారు. ఆయన గురువారం నుంచి ఫోన్ ఎత్తడం లేదని బాధితులు వాపోయారు. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లాలో బాధితులు ఏకమౌతున్నారు. రెండు రోజుల్లో కలెక్టర్, ఎస్పీని కలిసి ఫిర్యాదు చేయనున్నారని తెలిసింది. మరో జిల్లాలో ఓ వ్యక్తి లక్షలాది రూపాయలు నిర్వాహకులకు, ఏజెంట్లకు చెల్లించారు. జీతాలు అందకపోవడంతో మోసపోయామని, బతుకే ఆశ లేదని ఆవేదనకు లోనయ్యారు. 'ఆత్మహత్య చేసుకుంటా..' అని తోటి యోగా టీచర్ల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

సీఎస్ఆర్ ఫండ్స్ వస్తేనే జీతాలట..!

బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ నిర్వాహకులు టీచర్ల జీతాలకు కార్పొరేట్ కంపెనీలతో లింకు పెడుతున్నారట. కార్పొరేట్ కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద ఫండ్స్ ఇస్తాయని, ఆ డబ్బు రాగానే జీతాలు చెల్లిస్తామని చెబుతున్నట్లు తెలిసింది. ముంబాయి, ఢిల్లీ వంటి పెద్ద నగరాల్లో ఉండే ప్రముఖ బ్యాంకులు, కంపెనీలు.. సీఎస్ఆర్ కింద దయ తలచి ఫండ్స్ ఇస్తేనే యోగా టీచర్లకు జీతాలు చెల్లిస్తారట. 'ఆరేడు నెలల నుంచి పెద్ద పెద్ద కంపెనీలను ఫండ్స్ అడుగుతున్నాం. రాగానే జీతాలు చెల్లిస్తాం..' అని యోగా టీచర్లను వారు మభ్యపెడుతున్నారు. జీతాలు ఇవ్వాలని నిలదీస్తే పెద్ద కంపెనీలకు లెటర్లు రాసినట్లు కొన్ని కాగితాలు చూపిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఎవరైనా తాము చెల్లించిన డబ్బులు, జీతాలు అడిగితే బెదిరిస్తున్నారు. గ్రూప్స్ నుంచి తొలగిస్తున్నారు. తాజాగా వారి బండారం బయట పడటంతో వందలాది మంది పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



విద్యాదీవెన చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు, సంక్షేమశాఖల అధికారులు

విద్యాదీవెన సొమ్ము విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 1: జిల్లాలోని 40,006 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.29,07,75,479 విద్యాదీవెన సొమ్ము శుక్రవారం జమ అయినట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జగనన్న విద్యా దీవెన పథకం సొమ్ము విడుదల కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. 7,104 మంది ఎస్సీ విద్యార్థులకు రూ. 4.69 కోట్లు, 1,635 మంది ఎస్టీ విద్యార్థులకు రూ. 1.15 కోట్లు, 19,968 మంది బీసీ విద్యార్థులకు రూ. 13.94 కోట్లు, 2,298 మంది కాపు విద్యార్థులకు రూ. 1.84 కోట్లు, 4,987 మంది ఈబీసీ విద్యార్థులకు రూ. 4.69 కోట్లు, 3,907 ముస్లిం, మైనార్టీ విద్యార్థులకు రూ. 2.70 కోట్లు, 107 మంది క్రిష్టియన్ మైనార్టీ విద్యార్థులకు రూ. 7 లక్షల సొమ్మును తల్లుల ఖాతాలో జమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు కొగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ రిజ్వాన్, సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమాదేవి, ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావ్ పాల్గొన్నారు.

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లాలో విద్యాదీవెన ద్వారా నిధులు విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఈమేరకు కలెక్టర్ మెగా చెక్కును విడుదల చేశారు. జిల్లాలోని 34,169 మంది విద్యార్థులకు సంబంధించి రూ.23.84కోట్ల విద్యాదీవెన సొమ్మును వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమాధికారి శివరంగప్రసాద్, గిరిజన సంక్షేమాధికారి మోహన్‌రామ్ పాల్గొన్నారు.


ఆర్బీకేల్లో ఈ క్రాపింగ్ వివరాల ప్రదర్శన

అనంతపురం అర్బన్, మార్చి 1: రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల్లో 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి ఈ క్రాపింగ్ రైతుల జాబితాను ప్రదర్శిస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగైన 85,807 హెక్టార్లల్లో ఈ క్రాపింగ్ పూర్తైందన్నారు. జిల్లాలోని 56,621 మంది రైతులకు 55,469 మంది (98 శాతం) రైతులకు ఈ కేవైసీ పూర్తి చేయడం జరిగిందన్నారు. శుక్రవారం నుంచి ఈనెల 3వతేదీ వరకు ఈ క్రాపింగ్ జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామన్నారు. ఏవైనా అభ్యంతరాలు, తప్పులు ఉంటే అర్జీలు ఇవ్వాలన్నారు. ఆయా అర్జీలను ఈనెల 5లోగా ఏఓ, తహసీల్దార్ పరిష్కరిస్తారని, ఈనెల 8న ముసాయిదా క్రాపింగ్ జాబితాను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పసికందు అనంతకు రెఫర్



హిందూపురం అర్బన్, మార్చి 1: స్థానిక జిల్లా ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన మగ శిశువును మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి రెఫర్ చేశారు. గురువారం రాత్రి హిందూపురం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతి నేతృత్వంలో ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలు, పోలీసు సహకారంతో అంబులెన్స్‌లో శిశువును తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి, చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో బిడ్డను పరిరక్షిస్తున్నట్లు తెలిపారు.




ఏళంజి బ్రిడ్జి వద్ద రాళ్లు తేలిన ప్రధాన గట్టు

మరమ్మత్తు..!

- జిల్లా జీవనాడిపై నేతల నిర్లక్ష్యం
- హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు పట్టని ప్రభుత్వం
- ఐదేళ్లలో ఒక్క పైసా విదల్చని దుస్థితి
- నీరందక అన్నదాతకు తప్పని ఆవేదన



హొస్నూరు వద్ద కూలిపోయిన వంతెన(ఫైల్)



బొమ్మనహాళ్, మార్చి1: హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం మత్తు వదలడం లేదు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పనులు అటకెక్కాయి. కరువుజిల్లా అనంతపురానికి జీవనాడి అయిన హెచ్చెల్సీ కాలువల దుస్థితిపై అన్నదాత ఆందోళన చెందుతున్నారు. ప్రధాన కాలువతోపాటు ఉపకాలువలు సైతం దెబ్బతిన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12 మంది వైసీపీ ఎమ్మెల్యేలు, ఇద్దరు పార్లమెంట్ సభ్యులు ఉన్నా హెచ్చెల్సీ అభివృద్ధి ప నులు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా ఉంది. తుంగభద్ర జలాశయం నుంచి అనంతపురం జిల్లాకు తాగు, సాగునీటి ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులు 105 కి.మీ. నుంచి 2008లో పనులు ప్రారంభమయ్యాయి. కొంతవరకు చేసిన పనులకు రూ.450 కోట్లలో రూ.300 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన రూ.150 కోట్ల పనులు చేపట్టాల్సి ఉంది. ఈ ఐదేళ్ల కాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఒక్క అడుగూ కదలలేదు. ఆంధ్ర సరిహద్దులోని బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, దర్గాహొన్నూరు, డీ.హీరేహాళ్ మండలం మల్లికేతి, కణేకల్లు మండలం మీనహళ్లి గ్రామాల శివార్లలో ఉన్న హెచ్చెల్సీ వంతెనలు కూలిపోయాయి. వీటిని కొన్నిచోట్ల రైతులే చందాలు వేసుకుని బాగుచేసుకున్నారు. హెచ్చెల్సీ కాలువకు గండ్లు పడి ప్రధానకాలువ గట్టు దెబ్బతిన్నాయి. బలహీనమైన ప్రదేశాల్లో చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా అధికారయంత్రాంగం మరిచింది. హెచ్చెల్సీ కాలువ గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారని అధికారులకు, పాలకులకు ఆధునీకీకరణ పనులపై శ్రద్ధ లేకపోవడం దుర్మార్గమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలాపురం, నాగలాపురం ప్రాంతాల్లో గండ్లు పడినప్పటికీ అధికారులు తాత్కాలిక ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకున్నారని విమర్శిస్తున్నారు. కాలువపై 105 కి.మీ. నుండి 189 కి.మీ. వరకు సుమారు 50 వరకు బ్రిడ్జిలు ఉన్నా.. అవి బాగా దెబ్బతిన్నాయి. ఆంధ్ర సరిహద్దులో 105 కి.మీ. వద్ద 2,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండేది. దానిని 4,500 క్యూసెక్కులకు పెంచాలనే లక్ష్యంతో ఆధునికీకరణ పనులను చేపట్టారు. పనులు పూర్తి అయితే 2.90 లక్షల ఎకరాల ఆయకట్టు సాగునీటితోపాటు ప్రజలకు అవసరాలకు అనుగుణంగా తాగునీరు సరఫరా చేసేందుకు అవకాశం ఉంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో జిల్లాకు రావాల్సిన నీటి వాటాను రైతులు కోల్పోవాల్సి వచ్చింది. నవంబర్‌లోనే తుంగభద్ర జలాశయం నుంచి నీటి సరఫరా ఆగిపోయింది. డిసెంబర్ చివరి వరకు అందాల్సిన నీరు అందక బోరుబావులు లేనిచోట వరిపంట ఎండిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం హెచ్చెల్సీ ఆధునికీకరణకు ప్రాధాన్యం ఇచ్చింది. నాణ్యతగా పనులు పూర్తి చేసింది. నీటి ప్రవాహం పెరిగి అక్కడి ఆయకట్టు రైతులు సంతోషంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంపై రైతులు మండిపడుతున్నారు.

హెచ్చెల్సీని నిర్వీర్యం చేశారు: కేశవరెడ్డి, హెచ్చెల్సీ సాగునీటి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు



జిల్లాకు ప్రాణాధారమైన ఎగువకాలువను మరమ్మత్తులు చేపట్టడంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్ మండలాల పరిధిలోని నాగలాపురం, మైలాపురం తదితర ప్రాంతాలలో హెచ్చెల్సీ కాలువ తీవ్ర అధ్వాన్నంగా తయారైంది. కాలువ దెబ్బతిని గట్లు బలహీనపడ్డాయి. డిస్ట్రిబ్యూటరీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కాలువకు గట్టుదిట్టమైన చర్యలు చేపట్టలేదు. హెచ్చెల్సీ కాలువను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఏ రకమైన సమస్యలున్నాయి. ఏ రకమైన మరమ్మత్తులు అవసరమో పాలకులు, అధికారులు దృష్టి పెట్టలేదు. యుద్ధ ప్రాతిపదికన ఏమి చేయాలి, శాశ్వత ప్రతిపాదికన ఏమి చేయాలన్న ఆలోచన ఈ వైసీపీ ప్రభుత్వంలో అధికారులు, పాలకులు దృష్టి పెట్టలేదు. ఈ ఐదేళ్లలలో హెచ్చెల్సీని నిర్వీర్యం చేశారు.

నీరు లేక భూమి కౌలుకు ఇచ్చేశా: నిరంజన్, రైతు, బొమ్మనహాళ్



కృష్ణాపురం గ్రామం వద్ద 10 ఎకరాల పొలాన్ని సొంతంగా సాగు చేస్తుండేవాడిని. ఈ ఐదేళ్ల కాలంలో హెచ్చెల్సీ కాలువపై వంతెనలు కూలిపోయాయి. గండ్లు పడ్డాయి. దీంతో గండ్లు పూడ్చేందుకు నీటి సామర్థ్యాన్ని తగ్గిస్తున్నారు. ఆయకట్టుకు నీరు అందక పంట దిగుబడిపై ప్రభావం పడేది. ప్రభుత్వం కూడా హెచ్చెల్సీ పనులపైన ఎలాంటి శ్రద్ధ చూపలేదు. దీంతో గత ఖరీఫ్‌లో కూడా నీటి సమస్య ఉంటుందని హెచ్చెల్సీ కాలువ సక్రమంగా లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో చేసేదేమీ లేక 10 ఎకరాల పొలాన్ని తక్కువ ధరకే కౌలుకు ఇచ్చేశాను.

బోర్లపైనే ఆధారపడ్డాం: ఆంజనేయులు, రైతు, దేవగిరి



హెచ్చెల్సీకి సాగునీరు ఆలస్యంగా రావడం, ఆయకట్టుకు నీటి విడుదలలో జాప్యం , కాలువకు ప్రమాదాలు చోటు చేసుకోవడం కారణాలతో ఆయకట్టుకు సక్రమంగా నీరు అందేది కాదు. వ్యవసాయ బోర్లతోనే ఈ ఐదేళ్ల కాలంలో వ్యవసాయ బోర్లతోనే పంటలు సాగుచేశాము. ఆధునీకీకరణ పనులు పూర్తి చేసి కాలువపై వంతెనలు కొత్తవి నిర్మించి ఉంటే సాగునీరు సక్రమంగా అందేవి. ప్రభుత్వం హెచ్చెల్సీపై ఎలాంటి శ్రద్ధ పెట్టలేదు. వంతెనలు బాగా దెబ్బతిని ప్రధాన కాలువ గట్లు బలహీన పడ్డాయి. ప్రభుత్వం చొరవ చూపి హెచ్చెల్సీపై శ్రద్ధ పెట్టాలి.

పరీక్షల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి: ఎస్టీయూ

అనంతపురం విద్య, మార్చి 1 : త్వరలో జరిగే 10వ తరగతి పరీక్షల విధుల నుంచి చిన్న పిల్లల తల్లులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులను మినహాయించాలని ఎస్టీయూ నాయకులు.. డీఈఓ వరలక్ష్మిని కోరారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు.. డీఈఓను ఆమె చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు ఇతర నాయకులు మాట్లాడుతూ... పరీక్షల విధుల్లో కొంత మినహాయింపు ఇవ్వాలన్నారు. స్పాట్ వాల్యూయేషన్‌కు 20 శాతం అదనంగా టీచర్లను నియమించాలని, మెడికల్ బిల్లులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. సంఘం రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, ఇతర నాయకులు సూర్యనారాయణ, సురేష్ కుమార్, మహమ్మద్ రఫీ, రాజశేఖర్, దివాకర్ నాయుడు, మురళీకృష్ణ, ప్రభాకర్, మల్లికార్జున, విరూపాక్షి పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

మోడల్ స్కూళ్లలో ఆరో తరగతికి ప్రవేశాలు

- రేపటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు

అనంతపురం విద్య, మార్చి 1: ఏపీ మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఉత్తర్వు జారీ చేశారని డీఈఓ వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. విద్యార్థులు ఓసీ, బీసీ విద్యార్థులు1-9-2012 నుంచి 31-8-2014 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1-9-2010 నుంచి 31-8-2014 మధ్య పుట్టిన వారై ఉండాలన్నారు. అదేవిధంగా జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో చదివి ఉండాలన్నారు. 6వ తరగతిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఆంగ్లంలోనే బోధన ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుకో వడానిక ఎలాంటి పరీక్షల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కేవలం ప్రవేశ పరీక్షల కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ. 75 చెల్లించాలన్నారు. ఈనెల 2వతేదీ నుంచి 31వ తేదీ వరకూ నెట్ బ్యాంకింగ్ లేదా క్రెడిట్ కార్డ్, డేటా కార్డ్‌లను ఉపయోగించి పేమెంట్ గేట్‌వే ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. తర్వాత కేటాయించిన జనరల్‌నెంబర్ ఆధారంగా www.cse.ap.gov.in, www.apms.apcfss.in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మండలాల్లోని మోడల్ స్కూళ్లలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులకు 5వ తరగతి స్థాయి సిలబస్‌తోనే ఆంగ్లమాధ్యమంలో ప్రవేశ పరీక్షలు ఉంటాయని తెలియజేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జోనల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి

4న పెనుకొండకు చంద్రబాబు

- కియ వద్ద 'రా.. కదలిరా' సభ



పెనుకొండ టౌన్, మార్చి 1: టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 4న శ్రీసత్యసాయి జిల్లా పర్యటనకు వస్తున్నారు. పెనుకొండ సమీపంలోని కియ కార్ల పరిశ్రమ ఎదురుగా 'రా కదలిరా' బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని పార్టీ 5వ జోన్ ఇన్‌చార్జి రవీంద్ర, పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి సవిత శుక్రవారం తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన కియ పరిశ్రమ ద్వారా వేలాది కుటుంబాలు బాగుపడ్డాయని వారు అన్నారు. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ.. ఈనెల 4న టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను వారు పరిశీలించారు.

అంతర్జాతీయంగా జేఎన్‌టీయూకు సత్సంబంధాలు

- న్యాక్ గ్రేడింగ్ 'ఏ' రావడం హర్షణీయం
- వీసీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

అనంతపురం సెంట్రల్, మార్చి1: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా అంతర్జాతీయంగా జేఎన్‌టీయూ సత్సంబంధాలను మెరుగు పరుచుకోబుతున్నట్లు వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వీసీ మాట్లాడుతూ జేఎన్‌టీయూకి నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గ్రేడింగ్ 'ఏ' గుర్తింపు లభించడం హర్షణీయమన్నారు. 80 సంవత్సరాల చరిత్రగల జేఎన్‌టీయూ రాయలసీమ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యనందిస్తూ జాతీయస్థాయిలో ఖ్యాతి గడించిందన్నారు. న్యాక్ గుర్తింపు ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కొలాబ్రేషన్స్ పెంచుకుని రీసెర్చ్, ప్రాజెక్టులపై దృష్టిసారిస్తామన్నారు. తద్వారా డీఎస్టీ సంస్థ ద్వారా రూ.50కోట్ల నిధులతో ప్రాజెక్టును తీసుకువస్తున్నామన్నారు. న్యాక్ గుర్తింపు వర్సిటీ ఒక ఆభరణం లాంటిదని విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ మాట్లాడుతూ న్యాక్ గుర్తింపు సాధించేందుకు ఏడాదిపాటు బోధన, బోధనేతర సిబ్బంది ఎనలేని కృషిచేశారని కొనియాడారు. న్యాక్ బృంద పర్యటన సందర్భంగా దాదాపు నెలరోజులు సెలవులు తీసుకోకుండా శ్రమించారని అందుకు కృతజ్ఞతలని పేర్కొన్నారు. ఐక్యూఏసీ డైరెక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ న్యాక్ మాక్ కమిటీని ఏర్పాటుచేసి మూడు సార్లు ముందుస్తుగా పరిశీలించడం జరిగిందన్నారు. దీంతో లోటుపాట్లను సరిదిద్దుకుని ఏ గ్రేడింగ్ సాధనకు తోడ్పడిందన్నారు. అంతకుముందు ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో న్యాక్ గుర్తింపు ఆనందోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్లు ఈశ్వరరెడ్డి, సుజాత, శుభాబిందు, విశాలి, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: సవిత


టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితకు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

పెనుకొండ టౌన్, మార్చి 1: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో సవితను టీడీపీ, జనసేనకు చెందిన మహిళలు శాలువ, పూల హారాలు, బొకేలతో సన్మానించి అభినందించారు. సవిత మాట్లాడుతూ వైసీపీ పాలనకు మంగళంపాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ప్రతి కార్యకర్త, నాయకులు వైసీపీ అరాచకాలపై గళమెత్తాలన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని వచ్చే ఎన్నికల్లో ఆయనను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. టీడీపీ, జనసేన కూటమితో ప్రభంజనం తథ్యమన్నారు. జగన్మోహన్‌రెడ్డి తనకున్న అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో విధ్వంసం సృష్టించి దోపిడీ చేసుకున్నాడని ఆరోపించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుమార్, రాష్ట్రచేనేత విభాగం సభ్యులు ఎర్రిస్వామి, జిల్లా సంయుక్త కార్యదర్శి శివ, సోమందేపల్లి, పరిగి, మండలాల జనసేన నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థిని గెలిపించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

గుడిబండ, మార్చి 1: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని ఓటర్లను ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ అభ్యర్థించారు. శుక్రవారం మండలంలోని రాళ్లపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరుపున బరిలో ఉన్నానని ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజా సంక్షేమ అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తామన్నారు. చంద్రబాబు నాయుడు సీఎం అయితేనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సందర్భంగా పది కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. చేరిన వారిలో హనుమంతరాయప్ప, నంజుండప్ప, రమేష్ తదితరులు ఉన్నారు. టీడీపీ నాయకుడు చంద్రశేఖర్ ఉన్నారు.

వైసీపీ లేఅవుట్‌కు.. మున్సిపల్ వాహనం ఎలా పంపుతారు?

● కమిషనర్‌ను ప్రశ్నించిన టీడీపీ నాయకులు


కమిషనర్‌ను నిలదీస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

హిందూపురం, మార్చి 1: వైసీపీ నాయకులు ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ లేఅవుట్‌కు మున్సిపల్ యంత్రాన్ని ఎలా పంపుతారని టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం వైసీపీ ఇన్‌చార్జి దీపిక వేణురెడ్డి, కొంతమంది నాయకులు వేస్తున్న లేఅవుట్‌కు గురువారం ఎక్స్‌కవేటర్ డోజర్‌ను పంపారు. దీనిపై దినపత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనికి స్పందించిన టీడీపీ కౌన్సిరల్ రమేష్, సతీష్, రాఘవేంద్ర, నాయకులు నవీన్, నాగేంద్ర శుక్రవారం కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని కలిశారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ మా వార్డులో సమస్యలున్నాయని విన్నవించినా స్పందించలేదు కానీ వైసీపీ నాయకులు వేస్తున్న లేఅవుట్‌కు రోజంతా యంత్రాన్ని ఎలా పంపుతారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డుపక్కన గుంతలు పూడ్చారు. తప్ప లేఅవుట్‌లోకి యంత్రాలు కమిషనర్ వివరణ ఇచ్చారు. ఒకవేళ వెళ్లినట్లు ఆధారాలు చూపితే సంబందిత వ్యక్తులను సస్పెండ్ చేస్తామన్నారు. నాయకులు అమర్నాథ్, వెంకటేశ్, బాచి, మంగేష్, హెచ్ఎన్ రాము, సురేష్ పాల్గొన్నారు.

జ్వరపీడిత గ్రామాల్లో వైద్యశిబిరాలు


మణూరులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మడకశిర రూరల్, మార్చి 1: మండలంలో జ్వరాలు సోకిన మణూరు, ఛత్రం గ్రామాల్లో కల్లుమర్రి పీహెచ్‌సీ డాక్టర్లు మాధుర్య, వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరాలను ఏర్పాటుచేశారు. 'మణూరులో ప్రబలుతున్న విషజ్వరాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ప్రచురించిన కథనానికి వైద్యాధికారులు స్పందించిరు. డాక్టర్లు మాట్లాడుతూ మణూరులో జ్వరాలతో బాధపడుతున్న ముగ్గురికి రక్త నమూనలు తీసి ల్యాబ్‌కు పంపామన్నారు. మరో 30 మంది చికిత్సలు అందించామన్నారు. ఛత్రం గ్రామంలో 60 మందికి వైద్యసేవలు అందించామన్నారు. అలాగే మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ షమీఉల్లా ఆధ్వర్యంలో మణూరు 55 ఇళ్లకు, ఛత్రంలో 60 ఇళ్లలో మందులు పిచికారి చేయించామన్నారు. సూపర్ వైజర్ రాంప్రసాద్, ఎంపీహెచ్ఓ స్రవంతి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

రొద్దం, మార్చి 1: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ కేశవరెడ్డి సూచించారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పనులు నత్తనడకన సాగుతున్నాయని కూలీలను పిలిచి పనులను వేగవంతం చేయాలన్నారు. చాలా గ్రామాల్లో అతితక్కువ శాతం పనులు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఏపీఓ అనిల్‌కుమార్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను జయప్రదం చేయండి

పెనుకొండ, మార్చి 1: పల్స్‌పోలియో కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో పల్స్‌పోలియోకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఆదివారం జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల చిన్నారి వరకు పోలియో చుక్కలు వేయించి అంగవైకల్యం రాకుండా కాపాడాలన్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయని పిల్లలకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయాలన్నారు. యూపీహెచ్‌సీ సాయి సౌమ్య, డివిజన్‌కు చెందిన వైద్యులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

హిందూపురం అర్బన్, మార్చి 1: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకొని హాల్‌టికెట్ నెంబర్‌ను చూసికొని ఏ గదిలో వేశారో అని ఆత్రుతగా చూశారు. మొదటి రోజు తెలుగు, సంస్కృతంతో పాటు హిందీ, ఉర్దూ భాషను ఎంచుకున్న వారు పరీక్షలు రాశారు. హిందూపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు నారాయణ, సువర్ణభారతి, ఎల్ఆర్‌జీ నాయుడు, బాలాజీ, బాలయేసు ఇంటర్, బాలయేసు డిగ్రీ, సప్తగిరి ఇంటర్, సప్తగిరి డిగ్రీ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. డీఈసీ లక్ష్మీకాంత్‌రెడ్డి పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

లేపాక్షి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. 223మంది విద్యార్థులకుగాను 217మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆరుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. కేంద్రం వద్ద ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గోరంట్ల: పట్టణంలోని ఎస్‌పీఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 12మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ అడవాల సూర్యనారాయణ తెలిపారు. గోరంట్లలోని ఎస్‌పీఎస్ ఎస్‌పీఎస్, షిర్డిసాయి, ఎస్కేడీఆర్ కళాశాలలు, ఖాజాపురం, కస్తూర్బాకు చెందిన 279 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 260 మంది పరీక్షలు రాశారు. 12 మంది ఉర్దూ, 25మంది హిందీ, 8మంది సంస్కృతం, మిగిలినవారు తెలుగు పరీక్ష రాశారు.

మడకశిరటౌన్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలకు నాలుగు సెంటర్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 393 మంది విద్యార్థులకు గాను 24 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 321 మంది విద్యార్థులకు 8 మంది, వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో 283 మంది విద్యార్థులకు 11 మంది, సర్వోదయ జూనియర్ కళాశాలలో 407 మందికి గాను ఐదుగురు గైర్హాజరయ్యారు. గుడిబండ జూనియర్ కళాశాలలో 196 మందికిగాను 10 మంది, అమరాపురం జూనియర్ కళాశాలలో 246 మందికి నలుగురు, అగళి మోడల్ జూనియర్ కళాశాలలో 168 మందికి గాను ఆరుగురు గైర్హాజరయ్యారు.

పెనుకొండ: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జూనియర్ కళాశాల, సత్యసాయి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్షకు 20మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లుగా రామచంద్రయ్య, రామ్మోహన్‌రెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్‌గా బషీర్‌అహ్మద్, అనీల్‌కుమార్ వ్యవహరించారు. శుక్రవారం పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి.

అగళి: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తనిఖీ చేశారు. తాగునీరు, వైద్యం బందోబస్తుపై ప్రిన్సిపాల్ జాఫర్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణంలో ఎవరూ రాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా తనిఖీ చేశారు. 157మంది విద్యార్థులకుగాను ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. డీఓ మహేష్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.


పురంలో పరీక్షా కేంద్రంలోకి వెళ్లడానికి సిద్ధంగా..


పెనుకొండలో పరీక్షా కేంద్రంలోకి పరుగులు తీస్తున్న విద్యార్థులు


హిందూపురంలో హాల్‌టిక్కెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు


అగళిలో తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

పాఠశాల స్థలంలో మళ్లీ అక్రమ నిర్మాణాలు

● వైసీపీ సర్పంచ్‌కు నోటీసు ఇచ్చినా లెక్కచేయని వైనం

పెనుకొండ రూరల్, మార్చి 1: ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను స్టేషన్‌కు పిలిపించడం, కేసుల్లో ఇరికించడం, ఇళ్లను కూల్చడం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నైజం. వైసీపీ అనుసరిస్తున్న విధానాలు పల్లెలకు పాకుతోంది. తాజాగా ప్రభుత్వ పాఠశాలలో అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని విద్యాశాఖాధికారులు వైసీపీ సర్పంచుకు నోటీసులు అందించినా వారు లెక్కచేయలేదు. మళ్లీ పాఠశాల స్థలంలో ప్రహరీ నిర్మాణ పనులతో విద్యాశాఖాధికారులకు తలనొప్పిగా మారింది. ఈ సంఘటన పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే కురుబవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల స్థలంలో సిమెంటులారీ వెళ్లడంలేదని రెండు నెలల క్రితం వైసీపీ సర్పంచ్ నాగమూర్తి పాఠశాల ప్రహరీని ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా పాత ప్రహరీ స్థలం నుంచి 10మీటర్ల వెనక్కు జరిపి పాఠశాల స్థలంలో తీయించిన గుంతల వల్ల విద్యార్థులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని సర్పంచ్ నాగమూర్తికి విద్యాశాఖాధికారి విన్నవించారు. వారు పట్టించుకోకపోవడంతో గతనెల ఎంఈఓ సుధాకర్, చంద్రశేఖర్ పాఠశాలలో తవ్విన గుంతలను పూడ్చివేయించారు. శుక్రవారం సాయంత్రం సర్పంచ్ పాఠశాల స్థలంలో మళ్లీ అక్రమంగా నిర్మాణాలు చేపట్టేందుకు పూనుకున్నాడు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


కురుబవాండ్లపల్లి పాఠశాల ఆవరణంలో అక్రమంగా తవ్విన గుంతలు

పరీక్షాకేంద్రం మార్పుపై ఆందోళన


పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

చిలమత్తూరు, మార్చి 1: పదో తరగతి పరీక్షలకు ప్రైవేటు పాఠశాలలను కేంద్రంగా ఎంపిక చేయడంపై విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఎదుట శుక్రవారం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలోనే పరీక్ష కేంద్రం ఉండేదని, ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలకు ఎందుకు తరలించారని వారు ప్రశ్నించారు. దీనికి ఎంఈఓ సాల్మన్ రాజ్ స్పందిస్తూ పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని వసతులను దృష్టిలో పెట్టుకొంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన వసతులు లేవన్నారు. ప్రధానంగా బెంచ్ సౌకర్యం, సెక్యూరిటీ వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రైవేటు పాఠశాలలను ఎంపిక చేసి ఉన్నతాధికారులకు పంపించామన్నారు.

పది విద్యార్థులకు సామగ్రి వితరణ


దాతలు అందించిన విద్యాసామగ్రితో విద్యార్థులు, ఉపాధ్యాయులు

హిందూపురం అర్బన్, మార్చి 1: పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు హిందూపురం జోన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని అందించారు. శుక్రవారం స్థానిక చిన్మయా పాఠశాలలో 1500 మంది ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులకు అట్టలు, జామెంట్రీబాక్స్ తదితర వస్తువులను పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతియేడాది విద్యార్థులకు పరీక్షా సామగ్రిని ఇస్తున్నామన్నారు. కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి రియాజ్, హెచ్ఎం సరళ, ఉపాధ్యాయులు మహేష్, చంద్ర, సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు అందరికీ పంపిణీ చేయాలి

రొళ్ల, మార్చి 1: మండలంలో ప్రతి లబ్ధిదారుడికి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయాలని జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా కోఆర్డినేటర్ శివారెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం గ్రామసచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్డులో ఫొటోలు లేనివాటిలో ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్నికల కోడ్ దగ్గర పడటంతో సిబ్బంది జాగ్రత్తతో పనిచేయాలన్నారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా డ్రస్‌కోడ్ అమలు చేయాలన్నారు. లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెనుకొండ డీఎల్‌డీఓ సమత, ఎంపీడీఓ ప్రసాద్, ఈఓఆర్‌డీ కిష్టప్ప, రొళ్ల కార్యదర్శి శ్రీనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రబీ పంటల జాబితాను పరిశీలించుకోండి

చిలమత్తూరు, మార్చి 1: రబీలో సాగు చేసిన పంటల నమోదు వివరాల జాబితాను ప్రతి ఆర్‌బీకే కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామని, వాటిని పరిశీలించుకోవాలని మండల ఏఓ వంశీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే పంట నమోదుని పూర్తి చేశామన్నారు. అందులో ఎక్కడైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేసుకునేందుకు 3వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి

గోరంట్ల, మార్చి 1: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జాతీయ పర్యావరణ అవార్డు గ్రహీత, గ్రీన్ భారత్ ఫౌండేషన్ చైర్మన్ రెడ్డివారి శంకర్‌నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం గోరంట్లలో మన ఇల్లు కార్యక్రమంలో భాగంగా ఇంటింటా చెట్టు, ఊరంతా ఆక్సిజన్ ఉత్పత్తి నినాదంతో మొక్కలు నాటారు. ప్రస్తుతం గ్రామంలో చెట్లు లేక పక్షుల సంతతి అంతరించిపోతోందన్నారు. అడవుల్లోని జంతువులు, పక్షులు నీరు, ఆహారం లభించక అలమటిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ స్పందించి తమ నివాసాల వద్ద మొక్కలు నాటి, సంరక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు.

విద్యార్థులు సమాజ సేవను అలవర్చుకోవాలి

గోరంట్ల, మార్చి 1: ప్రతి విద్యార్థి సమాజ సేవను అలవాటు చేసుకోవాలని ఏఎన్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కెంపుల లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వారం రోజులపాటు జరిగే శిబిరం ద్వారా గ్రామంలో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలను వివరించారు. సేవా కార్యక్రమాల వలన కలిగే అనుభూతి మానసిక ఆనందం మరి ఎక్కడ లభించదన్నారు. ప్రతి విద్యార్థి అంకితభావంతో పనిచేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓలు ఆదినారాయణ, జయప్రకాష్, అధ్యాపకులు సుధాకర్, నరసింహులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

మామిడి చెట్లు, స్ప్రింక్లర్ల ధ్వంసం

రొద్దం, మార్చి 1: మండలంలోని మోపర్లపల్లి గ్రామంలో రైతు పూల జాఫర్‌వలికి చెందిన స్ప్రింక్లర్ పైపులు, మామిడిచెట్లు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం అర్ధరాత్రి తోటలో స్ప్రింక్లర్లు, నాలుగు మామిడిచెట్లను ధ్వంసం చేయడంతో శుక్రవారం రైతు చూసి ఆవేదన వ్యక్తం చేశారు. రూ.10వేలు నష్టం వాటిల్లిందన్నారు.

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

గుడిబండ, మార్చి 1: ఏఐఎస్ఎఫ్ మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి వీరేష్ తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా అంజి, కార్యదర్శిగా వినోద్, సభ్యులుగా ఉదయ్, రుద్రేష్, నందీష్, గౌతమ్, రేవంత్, వినయ్, పవన్, తిప్పేస్వామి ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలను వచ్చే విద్యాసంవత్సరంలోగా పూర్తిచేయాలన్నారు.

కాపునాడు ప్రధాన కార్యదర్శిగా అరవింద్



పెనుకొండ టౌన్, మార్చి 1: కాపునాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా సోమందేపల్లి గ్రామానికి చెందిన అరవింద్‌ను ఎంపిక చేశారు. శుక్రవారం ఇందుకు సంబంధించి ఒక ప్రకటన విడుదల చేశారు. కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు గాజులపల్లి సుబ్బరాయుడు నియామక పత్రం అందించినట్లు తెలిపారు. కాపుల కులస్థుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సకాలంలో స్పందించని 108 సిబ్బంది.. వృద్ధుడి మృతి

మడకశిర రూరల్ మార్చి 1: సకాలంలో 108 వాహనం స్పందించకపోవడం ఓ వృద్ధుడి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మండలంలో జమ్మానపల్లి గ్రామానికి చెందిన నరసింహప్ప(70)కు శుక్రవారం ఉదయం గుండెలో నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. వారు స్పందించిన సకాలంలో రాకపోవడంతో ఆటోలో మడకశిరకు తరలించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే వృద్ధుడు మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని కాపాడటం కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి 108 వాహనాలను ఏర్పాటు చేస్తే అవి సకాలంలో రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. 108 సిబ్బంది సకాలంలో స్పందించి ఉంటే ఆయన బతికే వారని వాపోయారు. దీనిపై 108 వాహన డ్రైవర్ స్పందిస్తూ నరసింహప్ప అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే స్పందించి 15 నిమిషాల్లో ఆగ్రామానికి వెళ్లాం. ఆయనకు గుండెపోటు రావడంతో అప్పటికే మృతిచెందాడని తెలిపారు.

నరసింహప్ప మృతికి టీడీపీకి తీరనిలోటు: టీడీపీ నాయకుడు నరసింహప్ప మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి సునీల్ కుమార్ అన్నారు. జమ్మానిపల్లిలో నరసింహప్ప శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్నా సునీల్ కుమార్ గ్రామనికి వెళ్లి భౌతిక కాయంపై పూలమాలు వేసి నివాళలర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈయన వెంట క్రిష్టప్ప, రామాంజనేయలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నరసింహప్ప మృతదేహం

దాసప్పపాళ్యంలో తాగునీటి ఎద్దడి

● పట్టించుకోని అధికారులు


బోరులో నుంచి వస్తున్న అరకొర నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

మడకశిర రూరల్ మార్చి 1: మండలంలోని దాసప్పపాళ్యం గ్రామంలో తాగునీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందలు పడుతున్నారు. అధికాలు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. వారు మాట్లాడుతూ గ్రామంలో మూడు బోర్లు ఉన్నాయని, అందులో రెండు బోర్లలో నీరు రావడం లేదన్నారు. ఉన్న ఒక్క బోరులో నీరు అడుగంటిపోవడంతో సమస్యగా మారిందని వాపోయారు. ఆరు నెలలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తప్పని పరిస్థితుల్లో వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో మరో రెండు బోర్లు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఖాళీ బిందెలతో ఎంపీడీఓ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనిపై స్థానిక పంచాయతీ కార్యదర్శిని ఫోన్‌లో వివరణ కోరగా ఆయన స్పందించలేదు.

దొడఘట్టలో రస్తా వివాదం


ఇంటికి వెళ్లకుండా ముళ్లకంపలు వేసిన దృశ్యం

రొద్దం, మార్చి 1: మండలంలోని దొడగట్ట గ్రామంలో రామచంద్ర, కిష్టప్ప వర్గీయుల మధ్య రస్తావివాదం నెలకొంది. శుక్రవారం కురుబ రామచంద్ర ఇంటికి వెళ్లకుండా కిష్టప్ప అనే వ్యక్తి ముళ్లకంపలు అడ్డంగా వేశాడు. దీంతో రామచంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండేళ్లుగా ఇరువర్గాల మధ్య రస్తా వివాదం నెలకొంది. అయినా రెవెన్యూ అధికారులు వారి సమస్యను పరిష్కరించలేదన్న విమర్శలున్నాయి. ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా స్థలాలను కొనుగోలుచేశారు. ఇందులో రస్తావివాదం నడుస్తోంది.

విద్యార్థి చదువు కోసం రూ.70 వేలు విరాళం


విద్యార్థి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న ఈడిగ సంఘం నాయకులు

గోరంట్ల, మార్చి 1: ఈడిగ సంక్షేమ సంఘం నాయకులు పేద విద్యార్థి హేమంత్‌కుమార్‌గౌడ్ ఇంజనీరింగ్ చదవడానికి రూ.70వేలు విరాళాన్ని శుక్రవారం అందించారు. పుట్టపర్తి మండలంలోని కర్ణాటక నాగేపల్లికి చెందిన ఈడిగ ఎర్రిస్వామి, విజయలక్ష్మి దంపతుల కుమారుడు హేమంత్‌కుమార్‌గౌడ్ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థి చదువులో అగ్రగామిగా ఉండగా, కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువుకు విఘాతం ఏర్పడింది. టీచర్ నాగేంద్ర ప్రోత్సాహంతో గోరంట్ల ఈడిగ సంఘం నాయకులు స్పందించారు. సభ్యులు విరాళాలు అందించిన నగదు రూ.70వేలను గోరంట్లలోని కమ్యూనిటీ భవనంలో విద్యార్థి తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వేణుగోపాల్, సాయిప్రశాంత్, రంగప్ప, నారాయణప్ప, రామక్రిష్ణ, గిరిధర్‌గౌడ్, నాగేంద్ర, టైలర్ క్రిష్ణ పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారం

హిందూపురం అర్బన్, మార్చి 1: జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నూతన అధ్యక్షుడు జేపీకే రాము, కోశాధికారి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి రవీంద్రుడు తెలిపారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో నవగ్రహాలకు వెండి వాకిలి ఏర్పాటు చేసి అక్కడ నుంచి ర్యాలీగా బయలు దేరి వాసవీ ధర్మశాలకు చేరుకుంటారు. అక్కడ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆర్యవైశ్య ప్రముఖులు మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, రాష్ట్ర నాయకుడు పోతుల సురేష్, ఏపీ ఆర్యవైశ్య సంఘం మహాసభ అధ్యక్షుడు చిన్నరామ సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేష్, పొలిటికల్ కమిటీ చైర్మన్ కోటా సత్యం రానున్నట్లు తెలిపారు.